క్లుప్తంగా

పాఠశాల సందర్శన



మాట్లాడుతున్న సెక్టోరియల్ అధికారి భాస్కర్

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా సెక్టోరియల్ అధికారి భాస్కర్ శుక్రవారం సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి హాజరయ్యారు. ఎఫ్ఎల్ఎన్ పాఠశాల స్థాయిలో అమలుపై పలు సూచనలు చేశారు. సమావేశంలో మండల నోడల్ అధికారి అంజయ్య, భూంపల్లి కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ రాజేందర్, చిట్టాపూర్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ ప్రభాకర్ రెడ్డి, రిసోర్స్ సర్సన్‌లు వెంకటేశం, అశోక్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రి కోసం తనయుడి ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న ఇంద్రనీల్

కోహెడరూరల్(హుస్నాబాద్): తండ్రి గెలుపు కోసం తనయుడు ఇంటింటి ప్రచారం నిర్వహించాడు. హుస్నాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి సతీష్‌కుమార్ తరపున ఆయన కుమారుడు ఇంద్రనీల్ మండలంలోని శనిగరం గ్రామంలో ఇంటింటి ప్రచారం చేశాడు. బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. మూడోసారి తన తండ్రికి ఓటు వేసి భారీ మెజార్టీ తో గెలించాలని కోరారు.

కేసీఆర్‌కు మద్దతుగా...



నాగిరెడ్డిపల్లిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): మండలంలోని ఖమ్మంపల్లి, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో కేసీఆర్‌కు మద్దతుగా డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పేదల పక్షపాతి సీఎం కేసీఆర్ అన్నారు. ఆయన ప్రవేశపెట్టిన పథకాల్లో లబ్ధి పొందని కుటుంబాలు లేవన్నారు. కేసీఆర్‌ను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

ఏకగ్రీవ తీర్మానం

సిద్దిపేట కమాన్: సిద్దిపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన మంత్రి హరీశ్‌రావుకే తమ ఓట్లంటూ పట్టణంలోని 35వ వార్డులోని వీరశైవలింగ బలిజ సమాజ సంఘం సభ్యులు శుక్రవారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సుకు తీర్మాన పత్రాన్ని అందజేసి ప్రతిజ్ఞ చేశారు.

ఆర్థిక సహాయం

బెజ్జంకి(సిద్దిపేట): లింగాల లక్ష్మణ్ యువసేన ఆధ్వర్యంలో శుక్రవారం బెజ్జంకి మండల కేంద్రంలో ఆడబిడ్డ కానుకగా బర్ల రేవతి, రాజు దంపతులకు ఆర్థిక సహాయంగా అందజేశారు. ఆడబిడ్డ జన్మించిన కుటుంబాలకు రూ.5016 చొప్పున అందిస్తామని యువసేన కార్యనిర్వాహక అధ్యక్షుడు వెంకటేష్ తెలిపారు.

స్ట్రాంగ్ రూమ్ కౌంటింగ్ కేంద్రాల పరిశీలన



ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేటఅర్బన్: పొన్నాల ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన అసెంబ్లీ ఎన్నికల స్ట్రాంగ్ రూమ్ కౌంటింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ శుక్రవారం పరిశీలించారు. సిద్దిపేట నియోజకవర్గ రిసెప్షన్, స్ట్రాంగ్ రూమ్ ఓట్ల లెక్కింపునకు (డి) బ్లాక్‌ను, హుస్నాబాద్ నియోజకవర్గం స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు కోసం (సి) బ్లాక్, గజ్వేల్ నియోజకవర్గం స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు కోసం (ఈ) బ్లాక్, దుబ్బాక నియోజకవర్గం స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు కోసం (ఏ) బ్లాక్ లను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కౌంటింగ్ కేంద్రాల లోపల కౌంటర్లను ఏర్పాటు చేయాలని పొలిటికల్ పార్టీ ఎంపిక సభ్యులు, ఇతర అధికారులు కూర్చునేందుకు సీటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. సిద్దిపేట స్ట్రాంగ్ రూమ్ వద్ద బందోబస్తులో ఉన్న కేంద్ర బలగాల అధికారులతో మాట్లాడి విజిటర్ బుక్ పరిశీలించారు. జిల్లాలోని పోలింగ్ బూత్‌లవారీగా దివ్యాంగుల కోసం తెచ్చిన వీల్ చైర్‌లను పంపిణీ చేయాలని ఆర్వోలకు సూచించారు. రాజీవ్ రహదారి నుంచి పొన్నాల మీదుగా ఇందూరు కళాశాలకు చేరుకునే మార్గంలో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నాగులబండ సమీపంలో ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌సీ సెంటర్‌ను పరిశీలించి విధుల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండటం పట్ల అసహనం వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట సిద్దిపేట ఆర్వో రమేశ్ బాబు, ఏసీపీ సురేందర్ రెడ్డి, త్రీ టౌన్ సీఐ భాను ప్రకాశ్, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, విద్యుత్ శాఖ ఎస్ఈ మహేశ్ తదితరులు ఉన్నారు.

హోమ్ పోలింగ్‌పై దృష్టి సారించండి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్, దుబ్బాక ఎన్నికల అధికారి గరిమా అగర్వాల్

- అదనపు కలెక్టర్, దుబ్బాక ఎన్నికల అధికారి గరిమా అగర్వాల్

దుబ్బాక: పోలింగ్ రోజున బీఎల్‌ఓలు పోలింగ్ అధికారులతో కలిసి విధులను సమన్వయంతో నిర్వర్తించాలని అదనపు కలెక్టర్, దుబ్బాక ఎన్నికల అధికారి గరిమా అగర్వాల్ అన్నారు. శుక్రవారం దుబ్బాక ఐఓసీ కార్యాలయంలో నియోజకవర్గ బీఎల్‌ఓ సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈనెల 21వ తేదీలోపు ఓటర్ స్లిప్‌లను పంపిణీ చేయాలన్నారు. అనంతరం హోమ్ పోలింగ్‌పై సమీక్షించారు. పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులు, 80 ఏళ్లు పైబడిన వృద్ధులకు నిర్ణయించిన తేదీలలో హోమ్ పోలింగ్ నిర్వహిస్తామన్నారు. హోమ్ పోలింగ్ నిర్వహణపై అధికారులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈఆర్‌ఓలు వెంకట్ రెడ్డి, సుజాత తదితరులున్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



పుస్తకాలను పరిశీలిస్తున్న అధ్యాపకులు

సిద్దిపేట ఎడ్యుకేషన్: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ (అటానమస్) డిగ్రీ కళాశాల డాక్టర్ ప్రసాద్ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో ఏర్పాటుచేసిన పుస్తక ప్రదర్శనను ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వాసం శ్రీనివాస్, లైబ్రేరియన్ డాక్టర్ ఆవులపాటి వేణు, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ గోపాల సుదర్శనం, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రవి కుమార్, ఆంజనేయులు, వివిధ విభాగాల అధ్యాపకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

మద్దూరు(హుస్నాబాద్): చేర్యాల మండలంలోని అర్జున్‌పట్ల గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పొన్నాల లక్ష్మయ్య మాట్లాడుతూ బీఆర్ఎస్ సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరిస్తూ పల్లాను భారీ మెజార్టీతో గెలిపించాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నాచగోని పద్మ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విజయానికి కృషి చేయాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గంలో బీజేపీ విజయం సాధించే దిశగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ అధ్యక్షుడు, అభ్యర్థి దూది శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీ సిద్దిపేట అసెంబ్లీ కార్యాలయ ఆవరణలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సిద్దిపేట అసెంబ్లీ ప్రభారీ రాజేష్ పిల్లే, శక్తి కేంద ఇన్‌చార్జిలు, బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

జనగామలో రౌడీల రాజ్యం రానివ్వం



జనగామ రూరల్ : వడ్లకొండలో ప్రచారం చేస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి



జనగామ: పల్లా సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన యువత

- జనగామ చైతన్యవంతమైన గడ్డ
- రేవంత్ రెడ్డి మాటలు ఎవరూ నమ్మరు
- అభివృద్ధికి పట్టం కట్టాలి
- బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి రాజేశ్వర్‌రెడ్డి

జనగామ రూరల్: జనగామ చైతన్యవంతమైన గడ్డ అని రౌడీల రాజ్యం రాకుండా అభివృద్ధికి పట్టం కట్టి మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆర్ కావాలని అందుకు ప్రజలు ఆశీర్వదించాలని బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వడ్లకొండ, పెద్దపహాడ్, గోపిరాజుపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వండ్లకొండలో విలేకరులతో వారు మాట్లాడుతూ ఈ గ్రామం చైతన్యవంతమైందని కమ్యూనిస్టు పోరాటాలు నడిచాయని గ్రామాల్లో ప్రజలు బీఆర్ఎస్ వైపు కదులుతున్నారన్నారు. మండలంలో 50 వేల మెజార్టీ వస్తుందనే నమ్మకం ఉందన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి మాటలకు ఎవరూ వినడం లేదని జోకర్ బ్రోకర్‌ను ప్రజలు విశ్వసించరని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి డీలాపడ్డాడని, తాను వ్యక్తిగత విమర్శలు చేయనని జనగామకు ఏం చేస్తానో చెబుతానన్నారు. తాను స్థానికుడిని కాదని చెబుతున్నారని.. నాది పక్క తరిగొప్పుల మండలం సోడాషపల్లి అని గెలిచిన తర్వాత పక్కాగా జనగామలోనే ఉంటానన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, ఎంపీపీ మేకల కళింగరాజు, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, జెడ్పీటీసీ నిమ్మతి దీపిక మహేందర్‌రెడ్డి, బక్క నాగరాజు , మండల శ్రీరాములు, మండల పార్టీ అధ్యక్షుడు యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

జనగామ ప్రజలకు 'పల్లా' సేవలు

జనగామ: జనగామ ప్రజల కష్టసుఖాల్లో పలుపంచుకోబోతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి హైదరాబాద్‌లో స్థాపించిన నీలిమ ఆస్పత్రిలో ఈ ప్రాంత ప్రజలకు పూర్తివైద్యం ఉచితంగా అందించేందుకు నిర్ణయం తీసుకున్నాడని ఆయన సతీమణి నీలిమ అన్నారు. శుక్రవారం ఆమె పట్టణంలోని ఆయా వార్డుల్లో బక్కా నాగరాజు, మల్లవరపు దివ్య, చెంచారపు పల్లవితో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. జనగామ నియోజకవర్గ ప్రజలకు నీలిమ హాస్పిటల్‌లో ఉచిత వైద్య సదుపాయాలను అందించేందుకు ముందుకు వచ్చారన్నారు.

'పల్లా' సమక్షంలో యువత చేరిక

పట్టణంలోని 4, 5 వార్డులకు చెందిన సుమారు 250 మంది యువకులు పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి పల్లా గులాబీ కండువా కప్పి స్వాగతించారు. ఉద్యోగులు, టీచర్ల, వీఆర్ఏలు, ఉద్యోగుల పీఆర్సీ పెంపు, ఔట్ సోర్సింగ్, ఉద్యోగాల కల్పన, ఆశ వర్కర్లు, ఉద్యోగుల జీతాల పెంపు విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.



జనగామ: ప్రచారంలో పాల్గొన్న పల్లా సతీమణి నీలిమ

కారుదే విజయం.. కేసీఆరే ముఖ్యమంత్రి

నర్మెట: ఎన్నికల్లో కారుదే విజయమని, మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆరేనని ఎమ్మెల్యే, నియోజకవర్గ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జ్ డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి శుక్రవారం ప్రచారం నిర్వహించిన ఆయన పల్లా రాజేశ్వర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను, వ్యాపారస్తులను కోరారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో స్టెతస్కోప్‌తో వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఆయన వెంట రాష్ట్ర నాయకులు గద్దల నర్సింగరావు, ఇమ్మడి శ్రీనివాస్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు చింతకింది సురేష్, ఉమ్మడి మండలాల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి, కోఆర్డినేటర్ నీరటి సుధాకర్, ఎంపీపీ తేజావత్ గోవర్ధన్, జెడ్పీటీసీ మాలోత్ శ్రీనివాస్, రామిని శివరాజ్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ శ్రేణుల ప్రచారం..

తరిగొప్పుల: పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ బీఆర్ఎస్ శ్రేణులు శుక్రవారం మండలకేంద్రంలో ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు పింగిళి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు గడపగడపకు వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. దామెర ప్రభుదాస్, చిలువేరు లింగం, అంకం రాజారాం, చెన్నూరి సంజీవ పాల్గొన్నారు.

అభివృద్ధి చేసే నాయకుడిని ఆదరించాలి

బచ్చన్నపేట : అభివృద్ధి చేసే బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఆదరించాలని బచ్చన్నపేట సర్పంచ్ వడ్డెపల్లి మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు వార్డుల్లో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. మన సంక్షేమ పథకాలు అలాగే కొనసాగాలంటే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించి అసెంబ్లీకి పంపించాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పలువురు పాల్గొన్నారు.



చేర్యాల : ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పక్కన ముత్తిరెడ్డి, రాజయ్య

నాన్నకు తోడుగా.. మీ ఓటు అండగా..

చేర్యాల(సిద్దిపేట): ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఆయన కుమారుడు పల్లా అనురాగ్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఓటర్లతో ముచ్చటించారు. నాన్నకు తోడుగా వచ్చా, మీరు ఓటు వేసి నాన్నకు అండగా నిలవాలని, కారు గుర్తుపై ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశాడు. ఆయన వెంట సర్పంచ్ ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు, రాష్ట్ర నాయకుడు ఏకానందం తదితరులున్నారు.

బీఆర్ఎస్‌లో భారీ చేరికలు

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికార బీఆర్ఎస్ పార్టీలోకి వలసల జోరు పెరిగింది. శుక్రవారం చేర్యాల పట్టణ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పార్టీలో చేరారు. వారికి జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, చుంచనకోట సర్పంచ్ ఆది శ్రీనివాస్ మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు పొన్నాల లక్ష్మయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు పొన్నాల కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి, కౌన్సిలర్ ఆడెపు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో హోమం



హోమం చేస్తున్న ధర్మకర్త కిషన్‌రావు

చేగుంట(తూప్రాన్): మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో వేంకటేశ్వర ఆలయంలో శుక్రవారం మహా మృత్యుంజయ హోమం నిర్వహించారు. ఉదయం స్వామివారికి అర్చన, అభిషేకం చేసి మధ్యాహ్నం హోమం పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కిషన్‌రావు, సర్పంచ్ రాములు, అర్చకులు పురుషోత్తంచారి, రఘునాథ్ చారి, ఆలయ నిర్వాహకులు మల్లేశం, నాయకులు భిక్షపతి, కన్నకయ్య, రాజు, సురేశ్, శ్రీకాంత్, వినయ్‌కుమార్, అజయ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే లక్ష్యం

తూప్రాన్: ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమని గజ్వేల్ కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి అన్నారు. శుక్రవారం తూప్రాన్‌లో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్, బీజేపీ నాయకులు తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని, లేని పక్షంలో తమ నాయకులు, కార్యకర్తలే బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజల కోసం ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తుందని, దీంతో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్‌కు మంచి ఆదరణ లభిస్తుందన్నారు.

మిర్జాపల్లి జెడ్పీపాఠశాలలో మాక్ పోలింగ్

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మిర్జాపల్లి జెడ్పీపాఠశాలలో శుక్రవారం మాక్‌పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం పుష్పవేణి మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు ఓటుహక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఓటుహక్కు ప్రధాన్యతను తెలిపేందుకే మాక్‌పోలింగ్ నిర్వహించినట్లు చెప్పారు.



మాక్ పోలింగ్‌లో విద్యార్థులు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

టేక్మాల్(మెదక్): నిబంధనలు అతిక్రమిస్తే ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఎన్నికల స్పెషల్ స్క్వాడ్ రాం ప్రసాద్ తెలిపారు. ఎన్నికల సందర్భంగా మండల కేంద్రమైన టేక్మాల్‌లో శుక్రవారం వాహనాలను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిబంధనల ప్రకారం రూ.50వేలకు మించి డబ్బులను తమ వెంట తీసుకుపోరాదన్నారు. అధిక డబ్బులు తీసుకుపోతే సీజ్ చేస్తామని తెలిపారు.

కాంగ్రెస్ వస్తే 2 లక్షల ఉద్యోగాలు

- హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం

హుస్నాబాద్: సీఎం కేసీఆర్ ఉద్యోగం పోతే 2 లక్షల ఉద్యోగాలు వస్తాయని నిరుద్యోగులు చెబుతున్నారని హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం ప్రొఫెసర్ వీరన్న నాయక్ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు చేపట్టిన నిరుద్యోగ చైతన్య బస్సు యాత్ర హుస్నాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాల వల్లనే నిరుద్యోగులకు ఉద్యోగాలు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఏడాది లోపు రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తుందన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామని హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.



హుస్నాబాద్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్

ప్రజల ఆకాంక్షను నెరవేర్చింది కాంగ్రెస్సే

సీపీఐ, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యేల పోరాట ఫలితంగా దివంగతవె వైఎస్ రాజశేఖర్ రెడ్డి గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మించి నియోజకవర్గ ఆకాంక్షలు నెరవేర్చారని హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

నియోజకవర్గంలోని ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు, యువకులు హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చిగురుమామిడి మండల జెడ్పీటీసీ గీకురు రవీందర్, కన్నారం ఎంపీటీసీ చెప్యాల బుచ్చమ్మ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన కన్నారం ఎంపీటీసీ చెప్యాల బుచ్చమ్మ

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం రామ్‌నగర్, మంగళపల్లి గ్రామాలకు చెందిన 80 మంది నాయకులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మాజీ ఎంపీ, హుస్నాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌గౌడ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ గెలుపు కోసం ప్రతీఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌ను నమ్మితే మోసపోతారు



జనగామలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఆరుట్ల



పార్టీలోకి యువకులను స్వాగతిస్తున్న దశమంతరెడ్డి

- మోదీ నాయకత్వంలోని బీజేపీని గెలిపించండి
- ప్రతి పథకంలో కేంద్రం వాటా
- బీజేపీ జనగామ అభ్యర్థి దశమంతరెడ్డి

జనగామ: తెలంగాణలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్, ఉమ్మడి రాష్ట్రంలో ఈ ప్రాంతాన్ని అధోగతి పాలు చేసిన కాంగ్రెస్ చెప్పే మాటలను నమ్మితే గోసపడక తప్పదని బీజేపీ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. జనగామలోని 22, 23, 24 వార్డుల్లో శుక్రవారం ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఆయా కాలనీల్లో పార్టీ శ్రేణులు ఆయన ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో చేసింది ఏమీ లేదన్నారు. డబుల్‌బెడ్ రూం ఇళ్ల పేరిట మోసపూరిత హామీలతో ఏఒక్క గ్రామంలో కూడా సొంతింటి కలను సాకారం చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఎన్నికల సమయంలో నిరుపేదలకు ఇచ్చిన హామీలు అమ లుకు నోచు కోలేదన్నారు. టీఎస్‌పీఎస్ పేపర్ లీకేజీలతో 30 లక్షల మంది నిరుద్యోగల జీవితాలతో ఆటలాడుకున్న బీఆర్ఎస్‌ను ఇంటికి పంపించాలన్నారు. రాత్రింబవళ్లు లక్షల రూపాయలు ఖర్చు చేసి కష్టపడి చదువుకున్న యువత కూలీ పనికి వెళ్లే దుస్థితి దాపురించిందన్నారు. తెలంగాణలో జరిగిన ప్రతి అభివృద్ధి పనిలో కేంద్రం నుంచి వచ్చిన నిధులు ఉన్నాయన్నారు. ఆయుష్మాన్ భారత్, రైతుకు పెట్టుబడి సాయం, విద్యకు పెద్దపీట, కరోనా సమయం నుంచి నేటి వరకు రేషన్‌షాపుల ద్వారా ఉచిత బియ్యం ఇలా అనేక స్కీంలను అమలు చేస్తున్న బీజేపీని ఆదరించాలన్నారు. అరచేతిలో స్వర్గం చూపిస్తున్న గులాబీ పార్టీని మూడోసారి ఇంటికి పంపించే సమయం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. ప్రాజెక్టుల పేరిట కోట్లు దండుకోవడమే తప్ప, ప్రజలకు అవసరమైన కనీస సదుపాయాలు కల్పించడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైయిందన్నారు. బీజేపీని ఆశీర్వదించి గెలిపిస్తే, ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తామన్నారు. ఈ ప్రాంత నిరుద్యోగులకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు నియోజకవర్గంలోని 8 మండలాలను అభివృద్ధి చేస్తామన్నారు. కాగా ఆయా కాలనీల్లో యువకులు, ఆయా వర్గాల ప్రజలు, పార్టీల కేడర్ బీజేపీలో చేరగా వారికి కండువా కప్పి దశమంతరెడ్డి స్వాగతించారు.